క్లుప్తంగా

భీమేశ్వరుని ఆలయంలో 15 నుంచి దసరా ఉత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి 24 వరకూ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఈఓ రాపర్తి రాజేశ్వర్రావు గురువారం విలేకర్లకు తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో నిత్యం అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. 15న గాయత్రిదేవి, 16న విజయలక్ష్మీదేవి, 17న సరస్వతీదేవి, 18న రాజరాజేశ్వరి, 19న అన్నపూర్ణాదేవి, 20న కాళికాదేవి, 21న కనకదుర్గాదేవి, 22న చాముండీ, 23న మహిషాసురమర్దిని, 24న బాలాత్రిపుర సుందరి అమ్మవారిగా రజిత కవచాలంకరణలో దర్శనమిస్తారన్నారు. అమ్మవారి భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

దాతల సాయంతో క్రీడాకారులకు అల్పాహారం



క్రీడాకారులకు అల్పాహారం అందజేస్తున్న హెచ్ఎం లీలామనోహర్ తదితరులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు దాతల సాయంతో నిత్యం ఉదయం అల్పాహారం అందజేస్తున్నారు. పాఠశాల విద్యార్థులు ఖోఖో ఆటల పోటీలలో పాల్గొనేందుకు నిత్యం ఉదయం 6 గంటలకే పాఠశాలకు వచ్చి ప్రాక్టీస్ చేస్తున్నారు. ఇది గమనించిన పూర్వ విద్యార్థులు, దాతలు సమకూరుస్తున్న అల్పాహారాన్ని హెచ్ఎం యు.లీలామనోహర్, పీడీ కె.శ్రీనివాస్ తదితరులు వారికి అందిస్తున్నారు.

వృద్ధులకు కళ్లజోళ్ల పంపిణీ

బాలాజీచెరువు: బాదం బాలకృష్ణ క్లాత్ అండ్ ఐ గ్లాస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం లయన్స్ హాల్లో 80 మంది పేదలకు ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. ముఖ్య అతిథిగా ప్రాజెక్టు వ్యవస్థాపకుడు డాక్టర్ బాదం బాలకృష్ణ హాజరై కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ జగన్నాథరావు, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ రామసుబ్రమ్మణ్యం, పేకేటి వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.


సర్వే దరఖాస్తులపై సత్వర చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

బోట్‌క్లబ్: సర్వే దరఖాస్తులపై నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో గురువారం కాకినాడ డివిజన్‌లోని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. జగనన్న శాశ్వత భూ హక్కు రక్షకు సంబంధించిన డివిజన్లో 121 గ్రామాల్లో రీసర్వే పూర్తయిన నేపథ్యంలో భూ హక్కు పత్రాలు పంపిణీని వేగవంతం చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులపై వీలైనంత త్వరగా సర్వే చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో పరిపాలనాధికారి వరహాలయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

యండమూరులో సురక్ష వైద్యశిబిరం



యండమూరులో రోగులకు మందుల కిట్లను అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

కరప: మండలం యండమూరులో గురువారం సర్పంచ్ మార్నెళ్ల శ్రీనివాస్(శివ) అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. యండమూరు, వడ్డిపాలెం గ్రామాల నుంచి 420 మంది రోగులు రాగా మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ ఈ.సింధూర తదితరులు వారిని పరీక్షించి, మందులు రాసిచ్చారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి కళ్లజోళ్లను అందజేశారు. కేస్ షీట్, మందుల కిట్లను పేషంట్లకు అందజేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, షేక్ దరియా, మీసాల చక్రం, ఉపసర్పంచ్ పి.పట్టాభి జానకిరామయ్య, కార్యదర్శి పి.వీరభద్రరావు, ఆరోగ్యమిత్ర వంచెర్ల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల పర్యటన

కరప: మండలం అరట్లకట్టలో గురువారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పర్యటించి రచ్చబండ నిర్వహించి, బాబుతోనేను కరపత్రాలను ఇంటింటికీ పంచారు. మండల పార్టీ అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, వాసిరెడ్డి ఏసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

జననేత జగన్‌కు ఆత్మీయ స్వాగతం



కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట మండలం ఈటీసీ లేఅవుట్‌లో గృహ ప్రవేశాల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం వచ్చారు. ఆయనకు ఆత్మీయంగా స్వాగతం పలుకుతున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కరరెడ్డి, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

సహకార వ్యవస్థతో బహుళ ప్రయోజనాలు

- ఎంపీ వంగా గీత
- వేడుకగా కేసీబీఎస్ వందేళ్ల సంబరాలు
- పురోభివృద్ధికి సహకరించిన వారికి సత్కారం
- హాజరైన విశ్రాంత అధికారులు



కేసీబీఎస్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత

కాకినాడ: సహకార రంగంలో పనిచేస్తున్న వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేసినప్పుడే ప్రభుత్వ సంకల్పం నెరవేరుతుందని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ (కేసీబీఎస్) వందేళ్ల సంబరాలకు ఆమె గౌరవ అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేవలం పది మంది సభ్యులతో ప్రారంభమై నేడు 33,000 మందితో 300 కోట్లకు పైగా డిపాజిట్లు, రుణాలతో కేసీబీఎస్ వంటి సంస్థ వందేళ్ల పాటు మనుగడ సాగించడం ఇతర సంఘాలకు స్ఫూర్తిగా నిలుస్తోందని ఎంపీ పేర్కొన్నారు. ఇటువంటి సంస్థలకు ప్రభుత్వ పరంగా తన వంతు తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. సొసైటీ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి అధ్యక్షతన గురువారం స్థానిక సూర్యకళా మందిరంలో ఈ వేడుక నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కోసూరి కృష్ణారావు, కోసూరి యదుసూర్య చిత్రపటాలకు నివాళులు అర్పించిన అనంతరం సత్యనారాయణమూర్తి స్వాగతోపన్యాసం చేశారు. సహకార రంగంలో కొనసాగుతున్న తమ సొసైటీ ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా సభ్యుల సహకారంతో వందేళ్ల ప్రస్థానాన్ని దిగ్విజయంగా పూర్తిచేసిందన్నారు. సంస్థ మరింత ప్రగతి సాధించేందుకు ఇదే సహకారాన్ని భవిష్యత్తులో కూడా అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి తమిళనాడు మాజీ చీఫ్ సెక్రటరీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.రామ్మోహన రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మరో గౌరవ అతిథిగా కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి పళ్లంరాజు, ఇన్‌కం టాక్స్ విశ్రాంత చీఫ్ కమిషనర్ పీవీ రావు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఆర్.మంగబాబు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. డీసీవో బీకే దుర్గాప్రసాద్, జిల్లా సహకార ఆడిట్ అధికారి పీబీఎంఎం కుమార్, రామ్‌దాస్ కో–ఆపరేటివ్ శిక్షణ సంస్థ ప్రతినిధి ఆదిమూలం వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. వందేళ్ల కేసీబీఎస్ ప్రస్థానంలో విశిష్ట సేవలు అందించిన గత పాలకవర్గ సభ్యులు, ప్రస్తుత, విశ్రాంత ఉద్యోగులతో పాటు, సంస్థ అభివృద్ధికి తోడ్పడిన, తోడ్పడుతున్న వివిధ వర్గాలను సత్కరించారు. వేడుకల్లో భాగంగా ప్రియా సిస్టర్స్ కర్ణాటక సంగీతం వీనుల విందుగా సాగి సభికులను విశేషంగా ఆకట్టుకుంది. సంస్థ ఉపాధ్యక్షుడు రెడ్డి వీర రాజేంద్రకుమార్ వందన సమర్పణ చేస్తూ, భవిష్యత్తులో కేసీబీఎస్ కార్యకలాపాలను మరింత విస్తరించి ప్రజలకు చేరువగా సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివ బాలయోగి, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, ఇన్‌చార్జి మేనేజర్ చీమలకొండ గంగాధరం పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దృష్టి దినోత్సవం



ప్రపంచ దృష్టి సంరక్షణ దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్ఎంసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో లవ్ యువర్ ఐస్ ఎట్ వర్క్ థీమ్‌తో ర్యాలీ నిర్వహించారు. గురువారం రంగరాయ వైద్య కళాశాల ప్రాంగణం నుంచి సర్పవరం వరకు నిర్వహించిన ర్యాలీని రంగరాయ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ దృష్టి సంరక్షణ దినోత్సవాన్ని వరల్డ్‌హెల్త్ ఆర్గనైజేషన్, విజన్ 20–20 ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అక్టోబరు రెండో వారంలో నిర్వహిస్తోందన్నారు. ఆసుపత్రి అడిషనల్ మెడికల్ డైరెక్టర్, రిఫ్రాక్టివ్ సర్జన్ డాక్టర్ అప్సర్ షర్మిలి మాట్లాడుతూ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో అంధత్వ నిర్మూలనలో భాగంగా 30 ఏళ్లలో 37 లక్షల మందికి నాణ్యమైన కంటి వైద్య అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంసీ ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వరరావు, కిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది, శారదా విద్యానికేతన్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆస్పత్రి సీఎస్ఆర్ హెడ్ రామ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి సంరక్షణపై శ్రద్ధపెట్టాలి



కంటి సంరక్షణను వివరిస్తున్న డాక్టర్ అప్సర్ షర్మిలీ

బాలాజీచెరువు: మానవ శరీర భాగాల్లో అత్యంత సున్నితమైన నేత్రాలు. వాటి సంరక్షణపై శ్రద్ధ వహించాలని కిరణ్ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ అప్సర్ షర్మిలి పేర్కొన్నారు. పీఎస్ లక్ష్మి మహిళ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దృష్టి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్లాకోమ, శుక్లాలపై అవగాహన కల్పించి, తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార పద్ధతులను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.సంధ్య నేత్రాల ప్రాధాన్యాన్ని వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కృష్ణ, లావణ్యకుమారి, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ పాల్గొన్నారు.

ఘనంగా పసర పండగ



వాకతిప్పలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్పలో గురువారం పసర పండగ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని చెట్టుబలిజపేటలో పూర్వ నుంచి పెద్దాపురం మరిడమ్మ అమ్మవారు కొలువై ఉంటుందని భావించి ఏటా అక్టోబర్‌లో అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా గురువారం గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా అమ్మవారి పండగ నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పాదగయ క్షేత్రంలో భవానీ భక్తుల రద్దీ



భవానీ భక్తులతో కిటకిటలాడుతున్న పాదగయ క్షేత్రం

పిఠాపురం: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వేలాది మంది భక్తులు భవానీ దీక్షలు స్వీకరిస్తున్నారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలోని పదో శక్తి పీఠమైన పురూహూతికా అమ్మవారి దివ్య సన్నిధిలో వారం రోజులుగా భవానీ భక్తుల రద్దీ కొనసాగుతోంది. గత రెండు రోజుల్లో సుమారు 20 వేల మంది భక్తులు భవానీ మాల ధరించారు. కాగా భవానీ దీక్షాధారణ సందర్భంగా గురువారం భారీగా భక్తులు తరలి రావడంతో పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. పాదగయ క్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి, పురూహూతికా అమ్మవార్లకు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

కనకదుర్గమ్మ ఆలయ ప్రతిష్ఠాపనలో ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి



మహోత్సవాల్లో పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

బోట్‌క్లబ్: స్థానిక సినిమారోడ్డులోని సంతచెరువు కనకదుర్గమ్మ వారి ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా గురువారం ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయడమే కాకుండా ఎంతో అందంగా రూపొందించారని జొన్నాడ చినబాబును అభినందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

పారిశుధ్య కార్మికుల సేవలు కీలకం

- కమిషనర్ నాగ నరసింహారావు
- ఉత్తమ సేవలకు సత్కారం



కమిషనర్ నాగ నరసింహారావును సత్కరిస్తున్న మొహమ్మద్ హలీం తదితర సభ్యులు

కాకినాడ: నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు కీలకమని, దేశంలోనే కాకినాడ నగరాన్ని రెండో స్థానంలో నిలిపిన పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అన్నారు. గురువారం కాకినాడ పిఠాపురంలో రోడ్డులో గల మేవా ఫంక్షన్ హాల్లో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆధ్వర్యంలో కాకినాడ స్మార్ట్ సిటీ పారిశుధ్యం విభాగంలో పురస్కారం పొందిన సందర్భంగా సంబంధిత అధికారులకు, పారిశుధ్య కార్మికులకు గురువారం అభినందన కార్యక్రమం జరిగింది. ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ హలీం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కమిషనర్ పాల్గొని మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు. మొహమ్మద్ హలీం మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా కొంత మంది ఉత్తమ అధికారులకు, 50 మంది ఉత్తమ పారిశుధ్య కార్మికులను సత్కరించడం జరిగిందన్నారు. అనంతరం నాగ నరసింహారావును సత్కరించారు. అనంతరం శానిటరీ సూపర్‌వైజర్ జిలానీ, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను, 50 డివిజన్ల పారిశుధ్య కార్మికులను కమిషనర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన బీసీ ముస్లిం, క్రైస్తవ సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు భద్రం మాస్టార్, ఏపీజే రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్, కార్యవర్గ సభ్యులు రవి, కార్యదర్శి అబ్దుల్లా, ఉపాధ్యక్షులు ఇమామ్ మొహియుద్దీన్, కాజా మొహిద్దీన్, కోశాధికారి ఎస్.ఎం.బాషా, జాయింట్ సెక్రటరీ శామ్యూల్, లలితదేవి, మంగ, సహస్రా, రామిజాన్నిసా, కలీం, అల్లావుద్దీన్, వెంకటలక్ష్మి, గిరిజ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలకు రసాస్వాద ఎక్స్‌లెన్స్ అవార్డు



మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సుగుణారెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆదిత్య డిగ్రీ కాకినాడ కళాశాలకు రసాస్వాద ఎడ్యుకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించినట్టు కళాశాల చైర్మన్ ఎన్.శేషారెడ్డి గురువారం తెలిపారు. విజయవాడలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నట్టు ఆ విద్యాసంస్థల కార్యదర్శి సుగుణారెడ్డి, కో–ఆర్డినేటర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అందుకున్నట్లు తెలిపారు. మెరుగైన విద్యా ప్రమాణాలను పాటిస్తూ, నాణ్యమైన విద్యను అందిస్తూ తమ కళాశాల న్యాక్ ఏ ప్లస్ ప్లస్ సాధించడం వల్ల అవార్డు అందజేశారన్నారు.